

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028



రెడ్ క్రాస్ సొసైటీకి అభివృద్ధి కోసం చేయూతను అందించండి.





Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 246 పేజీలు - 08 వెల - 05/- మంగళవారం 01-09-2026


# భగీరథ ప్రయత్నంతో
# కరవు సీమకు కృష్ణమ్మ

## తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు



- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం

మార్కాపురం, ఆగస్టు 31; మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

### 30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల



తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ..

మిగతా 2లో

# ‘పుట్టింటి నుంచే బయటకు పంపారు’..



- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- “కవిత సీఎం” అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను

మిగతాది 2లో

# ఒక్కరి దానం..
## వేలమందికి నీడనిచ్చే మహావృక్షం: మంత్రి

### హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం




“ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ” అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

మిగతాది 2లో

ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..
## రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



2

# యూపీలో విషాదం..
## బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి



2

- యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- 11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు

# చదువుల గుడియా..
## చెత్తకుప్పల గొడౌనా?!

- నెత్తిపై పెచ్చులూడే పైకప్పు.. చుట్టూ దుర్గంధం వెదజల్లే చెత్తబుట్టలు!
- 114 మంది పసిగుండెల్లో చావు భయం.. నేలపైనే పడి అక్షర రోదన



### విద్యాశాఖ మంత్రి లోకేష్ గారూ.. ఇదేనా ‘మనబడి--మన భవిష్యత్తు’?!



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో** ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరు పెట్టుకున్న ఆ బడిలో అడుగుపెడితే కడుపు తరుక్కుపోతోంది. అది విద్యార్థులను తీర్చిదిద్దే జ్ఞాన భాండాగారమా లేక పురపాలక శాఖ పారేసిన చెత్త డబ్బాల డంపింగ్ యార్డా అన్నది అర్థం కాక జనం ముక్కున వేలేసుకుంటున్నారు. కర్నూలు నగరం నడిబొడ్డున ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల దుస్థితిని చూస్తే పాలకుల మాటల గారడీకి, అధికారుల రాతి గుండెలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామన్న ప్రగల్భాలు ఇక్కడ చెత్తబుట్టల కింద సమాధి అయిపోతున్నాయి.

పసి హృదయాల మధ్య ‘మున్సిపల్ చెత్త’!

నగరంలో ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన మున్సిపాలిటీ

మిగతాది 9లో

# విశాఖలో ఘోర ప్రమాదం...

- విశాఖ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని ఢీకొని కారులో చెలరేగిన మంటలు
- తప్పించుకునే అవకాశం లేక డ్రైవర్ సజీవదహనం
- నంబర్ ప్లేట్ ఆధారంగా మృతుడిని గుర్తిస్తున్న పోలీసులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం



2

రెండ్రోజుల పాటు పులివెందులలో
# జగన్ పర్యటన.

### పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం



- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు.పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని

మిగతాది 2లో

# ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు జిల్లా కృష్ణగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు...పాఠశాలలోని తరగతి గధులతో పాటు విద్యార్థులకు కలిపిస్తున్న మౌలిక వసతులను ఆయన పరిశీలించారు..విద్యార్థుల హాజరు శాతం రిజిస్టర్లను తనిఖీ చేసి బడికి రాని పిల్లల గురించి ఆరా తీశారు..విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎంపీ పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు... పదవ తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు నగదను అందజేస్తానన్నారు...అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంపీ నాగరాజు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు...ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను ఉపాధ్యాయులు ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు...





# శ్రీశైలంలో మంత్రి పార్థసారధి ప్రత్యేక పూజలు

పల్లె వెలుగు శ్రీశైలం. సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖల మంత్రి పార్థసారధి సోమవారం ఉదయం శ్రీశైలం చేరుకుని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, నిర్వహణకు సంబంధించిన వివరాలను అర్చకులు మంత్రికి వివరించారు.






# మంత్రి ఫరూక్‌ను కలిసిన వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యులు

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ (ఏపీ స్టేట్ వాక్ఫ్ ట్రిబ్యునల్) సభ్యులుగా మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ నియామక ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా, నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో (జీవో.ఆర్.టీ.నెంబర్ . 107) ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యులుగా నియమితులైన మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ మంత్రి ఫరూక్ కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు ప్రభుత్వానికి, మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో మరియు వివాదాల పరిష్కారంలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తూ పేద, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ సుబ్లి, కర్నూల్ గవర్నమెంట్ కాజీ సలాం మౌలానా, చాబోలు ఇలియాస్, మునియార్ ఖలీల్, మిద్దె హుస్సేన్, అస్మద్దీన్ మరియు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

- అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి
- 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులు పూర్తిగా తగ్గాలి
- సెప్టెంబర్ 30 నాటికి '22-ఏ' భూముల వివరాలు ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు కావాలి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని, బాధితులు సంతృప్తి చెందేలా ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు సత్వరమే స్పందించాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సమగ్ర వివరాలతో ఉండాలని సూచించారు. ఏదైనా సమస్యను పరిష్కరించడం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాలను బాధితులకు అర్థమయ్యేలా వివరించాలని ఆదేశించారు.



**'రీ-ఓపెన్' కేసులు ఉండకూడదు**

పీజీఆర్ఎస్‌లో 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకసారి పరిష్కరించిన సమస్య మళ్లీ అధికారుల ముందుకు రాకుండా, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని తేల్చిచెప్పారు.

**22-ఏ భూముల వివరాలు అప్‌డేట్ చేయాలి**

సెప్టెంబర్ 30 నాటికి 22-ఏ కింద పరిష్కారమైన అన్ని భూముల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అడంగల్ పోర్టల్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రికార్డులను క్షేత్రస్థాయి వివరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివప్రసాద్ రెడ్డి, రామసుబ్బయ్యతో పాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీమ గొంతు నులుముతుంటే చోద్యం చూస్తారా?..

# గోరకల్లుపై టీడీపీ నేతలకు కాటసాని వార్నింగ్

- శ్రీశైలం నీళ్లను తెలంగాణకు దోచిపెడుతూ నిద్రపోతున్న కూటమి పాలకులు
- పరిశ్రమల్లో స్థానిక బిడ్డలను కాదని 'పచ్చ' కోటా ఇస్తే తిరగబడతాం: కాటసాని రామభూపాల్ రెడ్డి హెచ్చరిక
- రైతుల పక్షాన పోరాడితే నిర్బంధిస్తారా?.. పోలీసుల తీరుపై మండిపాటు
- శిల్పా చక్రపాణి రెడ్డి, బి.వై. రామయ్యలతో కలిసి కాటసాని మీడియా సమావేశం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో 'గోరకల్లు రిజర్వాయర్‌పై చరిత్ర, కనీస అవగాహన లేకుండా మాట్లాడితే నాలుకలు చీరేస్తాం.. రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి బురదజల్లే రాజకీయాలు చేస్తే సహించే ప్రసక్తే లేదు" అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అధికార టీడీపీ నేతలను తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, కర్నూలు నగర మాజీ మేయర్ బి.వై. రామయ్యలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "2020 నుంచి 2024 వరకు గోరకల్లు రిజర్వాయర్ కట్ట కుంగిపోయిన క్లిష్ట సమయంలో గ్రీన్‌కో కంపెనీతో మాట్లాడి రాత్రింబవళ్లు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాం. సుమారు 11 టీఎంసీల నీటిని నిల్వ చేసి రైతుల పంటలను కాపాడిన చరిత్ర మాది. అలగనూరు రిజర్వాయర్ దెబ్బతిన్నా కేసీ కెనాల్‌ను కదిలించి రైతాంగానికి అండగా నిలిచాం. 1995 నుంచి 2004 వరకు తొమ్మిదేళ్లు సీఎంగా ఉండి సీమకు చంద్రబాబు ఏం చేశారో చెప్పే దమ్ముందా? దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్ పాలనలోనే ఎస్సార్బీసీ సహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి రాయలసీమకు జీవం పోశారు" అని స్పష్టం చేశారు.



**శ్రీశైలం నీటి దోపిడీపై ఎందుకు మౌనం?**

శ్రీశైలంలో పుష్కలంగా నీరున్నా తెలంగాణ ప్రాంతం అడ్డగోలుగా తరలించుకుపోతుంటే, విద్యుత్ ఉత్పత్తి పేరిట నీరంతా నాగార్జునసాగర్‌కు పోతుంటే ఈ ప్రభుత్వం ఎందుకు నిద్రపోతోందని కాటసాని నిలదీశారు. గతంలో వైఎస్సార్ ఏప్రిల్ వరకు శ్రీశైలంలో నీటిమట్టం ఉండేలా పటిష్ట చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. జగన్ హయాంలో చేపట్టిన సీమ ప్రాజెక్టులను కొనసాగించకపోవడం వల్లే నేడు రైతులు నీటి కోసం కన్నీళ్లు పెట్టాల్సి వస్తోందని, సీమ నీటి హక్కుల సాధన కోసం రైతాంగం పార్టీలకతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

నిర్వాసిత యువత పొట్టకొట్టి 'పచ్చ బ్యాచ్'కా ఉద్యోగాలు?

గోరకల్లు పరిసరాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమల్లో భూములు త్యాగం చేసిన నిర్వాసిత రైతుల బిడ్డలకు, స్థానిక యువతకు కాకుండా కేవలం పచ్చ చొక్కాలకే ఉద్యోగాలు కట్టబెట్టడంపై కాటసాని నిప్పులు చెరిగారు. "పరిశ్రమల యాజమాన్యాలు గుర్తుపెట్టుకోండి.. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి స్థానిక రైతు బిడ్డలకు అన్యాయం చేస్తే ఊరుకోబోము" అని హెచ్చరించారు.

**అన్నదాతల కోసం గళమెత్తితే నిర్బంధిస్తారా?**

రైతులకు జరిగిన అన్యాయాన్ని శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులం కాదని, అన్నదాతల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని, రైతులకు ఎవరు అండగా నిలిచినా సంపూర్ణ మద్దతిస్తామని నేతలు స్పష్టం చేశారు.

# రెడ్ క్రాస్ సొసైటీకి అభివృద్ధి కోసం చేయూతను అందించండి.

- జీవితకాల సభ్యత్వం ద్వారా సొసైటీ అభివృద్ధికి కృషి చేయండి.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో రక్తనిల్వలను పూర్తి స్థాయిలో ఉంచాలనే సంకల్పంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు సంబంధించి ఉద్యోగులందరూ సభ్యులుగా నమోదు అవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంటుందని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ దస్తగిరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, డిఆర్ఓ రామునాయక్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....జిల్లాలో రక్తనిల్వల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతం కోసం జిల్లా పరిషత్ సిబ్బంది 30 మంది జీవితకాల సభ్యత్వం తీసుకోగా రూ.33 వేలు ఇవ్వడం జరిగిందని, గతంలో కూడా ఎంపిడిఓలు, సూపరింటెండెంట్లు, జిల్లా పరిషత్ సిబ్బంది నుండి మొత్తం 56 మంది జీవితకాల సభ్యత్వం తీసుకోవడం ద్వారా రూ.61,600/- సమకూరడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడానికి ఉద్యోగులందరూ కేవలం వెయ్యి రూపాయలు చెల్లించి జీవితకాల సభ్యతం తీసుకోవచ్చు అన్నారు. అదే విధంగా వైస్ పాట్రన్ కోసం రూ.12,500/-, పాట్రన్ కోసం రూ.2,5000/- చెల్లించాల్సి ఉంటుందని, గుర్తింపు కార్డు కోసం అదనంగా వంద రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సభ్యత్వం ఉన్న వారికి అతి తక్కువ రుసుముతో రక్తం అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అవసరం ఉన్న సేవలు అందించడంతో పాటు అత్యవసర సమయంలో సిపిఆర్ చేయడం, బ్రహ్మోత్సవాల సమయంలో విధులు నిర్వహించడం జరుగుతోందన్నారు.




అంతేకాకుండా జిల్లాలో అందించిన ఉత్తమ వైద్య సేవలకు గాను రాష్ట్ర గవర్నర్ మెరుగైన ఆరోగ్యం అందించాలని సంకల్పంతో "మీ ఇంటికి – మీ డాక్టరు" క్రింద రూ.2 కోట్లతో అంబులెన్స్ హాస్పిటల్ ను పంపడం జరిగిందన్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వీసు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవసరమైన పూర్తి స్థాయి ఆరోగ్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా డిఆర్ఓ, ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి సభ్యత్వం పెంచేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కి జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న నేపథ్యంలో యువ రక్తదాతలను పెంచేలా డిఈఓ, డివిఈఓ కృషి చేయాలన్నారు.

# పి ఎం జె వి కె మైనారిటీ హాస్టళ్లను వెంటనే ప్రారంభించాలి

**-- ఉర్దూ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలి.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ప్రధానమంత్రి



జనవికాస్ కార్యక్రమం ( పి ఎం జె వి కె) కింద నంద్యాలలో నిర్మించిన నాలుగు మైనారిటీ హాస్టల్ భవనాల మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి, వాటిని విద్యార్థుల కోసం ప్రారంభించాలని, అదేవిధంగా ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని కోరుతూ నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ, ఐ.ఏ.ఎస్. ని పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, గౌరవాధ్యక్షులు ఎస్. ముహమ్మద్ అబులైస్ మాట్లాడుతూ, గతంలో ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చేసిన కృషి, ప్రతిపాదనల ఫలితంగా పి ఎం జె వి కె పథకం కింద నంద్యాలకు నాలుగు మైనారిటీ హాస్టళ్లు, ఒక సద్భావన భవనం, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు ఒక భవనం కలిపి మొత్తం ఆరు భవనాలు మంజూరయ్యాయని తెలిపారు.

వీటిలో నాలుగు హాస్టల్ భవనాల నిర్మాణం మాత్రమే చేపట్టి అధికభాగం పనులు పూర్తి చేశారని, అయితే ఉర్దూ జూనియర్ కళాశాల భవనం, సద్భావన భవనం పనులను సంబంధిత కాంట్రాక్టర్ నిర్ణీత సమయంలో ప్రారంభించకపోవడంతో వాటికి మంజూరైన నిధులు వెనక్కి వెళ్లినట్లు వివరించారు. మైనారిటీ విద్యార్థుల కోసం నిర్మించిన నాలుగు హాస్టల్ భవనాలను జిల్లా పరిషత్ కార్యాలయాలకు లేదా ఇతర అవసరాలకు మళ్లించకుండా, వాటిని విద్యార్థుల హాస్టళ్లుగానే వినియోగించాలని కోరారు.

ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలోని కేవలం రెండు గదులు, రెండు తాత్కాలిక షెడ్లలో కొనసాగుతోందని తెలిపారు. సుమారు 250 మంది విద్యార్థులు, వారిలో అత్యధికంగా బాలికలు చదువుతున్న ఈ కళాశాలలో తరగతి గదులు సరిపోక కొందరు విద్యార్థినులు చెట్ల కింద కూర్చొని పాఠాలు వినాల్సిన దయనీయ పరిస్థితి ఉందన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాల శాశ్వత భవన నిర్మాణం కోసం పక్కనే ఉన్న సుమారు 50 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని జిల్లా యంత్రాంగం ఇప్పటికే మంజూరు చేసి మైనారిటీ సంక్షేమ శాఖకు అప్పగించిందని తెలిపారు. ప్రతిపాదిత కళాశాలకు ప్రత్యేక ప్రవేశ ద్వారం, ప్రహరీ గోడ, అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించడం ద్వారా పక్కనే ఉన్న బాలికల కళాశాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రెండు విద్యాసంస్థలు స్వతంత్రంగా పనిచేయగలవని కలెక్టర్ కి వివరించారు.

గౌరవ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యంలో స్థలానికి సంబంధించిన పూర్తి వాస్తవాలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే కొనసాగుతున్న కో-ఎడ్యుకేషన్, వేర్వేరు ప్రవేశ మార్గాలు, ప్రతిపాదిత భద్రతా ఏర్పాట్లను ప్రభుత్వం తరఫున సమగ్రంగా తెలియజేయాలని కోరారు. వెనక్కి వెళ్లిన నిధులను తిరిగి మంజూరు చేయించేందుకు లేదా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ స్పందించినట్లు నాయకులు తెలిపారు.

మైనారిటీ బాలికల విద్య, భద్రత మరియు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాలుగు హాస్టళ్లను త్వరగా ప్రారంభించడంతోపాటు, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని నంద్యాల ముస్లిం జేఏసీ కోరింది.

ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, గౌరవ అధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు అన్సర్ భాష ఎస్డిపిఐ కలాం, టి కరీముల్లా, జేఏసీ యూత్ సభ్యులు అయ్యూబ్, బషీర్ అహ్మద్, కషీఫుర్ రెహమాన్, ముస్లిం ఐక్యవేదిక వహాబ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి.

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు వినతిపత్రం అందజేసిన రజక సంఘం నాయకులు.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్‌లోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే చిరకాల డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రజక సంఘాల నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని నంద్యాలలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ తరఫున నాయకులు మాట్లాడుతూ, దేశంలోని 18 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఇప్పటికే షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్సీ) జాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985 లోనే దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని క్యాబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపారని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలలో, గవర్నర్ ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించారని, అలాగే 2024 ఎన్నికల ముందు మంగళగిరి బీసీ డిక్లరేషన్‌లో కూడా ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి రాగానే కేంద్రంతో చర్చించి రజకులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వినతిపత్రంలో తెలిపారు . రాష్ట్రవ్యాప్తంగా రజకుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని మంత్రి ఫరూక్ కి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత ధోబి మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు, రజక సాధన నంద్యాల జిల్లా కన్వీనర్ సుబ్రహ్మణ్యం, నాయకులు నాగరాజు, ఎర్రగుంట్ల హరి, సంజీవరాయుడు, శీను, చలమరాజు, రామచంద్రుడు, గోస్పాడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్ కార్మికులను ఆదుకోవాలి

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 31: పారిశు



ద్ధ్య కార్మికులకు నెలల తరబడిగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ బండి ఆత్మకూరు మండల పారిశుద్ధ కార్మిక సంఘం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుధ్య కార్మికులకు నెలల తరబడిగా పెండింగ్ వేతనాలను ఇవ్వకపోవడం వల్ల కుటుంబాలు పూట గడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు కొండెక్కి కూర్చోవడంతో అనుభవిస్తున్నారని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. గ్రామాల పరిశుద్ధ విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల సేవలను గుర్తించి కార్మికులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మెడికల్ కిట్స్ శానిటేషన్ బ్లౌజులు బూట్లు వెంటనే ఇవ్వాలని విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. సమస్యలను త్వరలో పరిష్కరించకపోతే డి ఎల్ పి ఓ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రత్నమయ్య, పారిశుద్ధ కార్మికులు ప్రతాప్ పుల్లయ్య మోజెస్ శేఖర్ ఖాదరయ్య మిఖాయిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ పద్మావతమ్మకు సమర్పించారు. కార్మికుల వేతనాల చెల్లింపులో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులతో ఒక సమావేశాన్ని నిర్వహించి జీతాల చెల్లింపు విషయంలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చంద్రమౌళి వివరించారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి మున్సిపల్ చైర్మన్ ఢ కౌన్సిలర్,జడ్పీటీసీ, ఎంపీటీసీ,సర్పంచ్ పదవులకు పోటీ చేస్తాము టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య.

**-కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ లు నేర వేర్చడంలో విఫలం.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, పి సి సి మాజీ జనరల్ సెక్రటరీ చింతల మోహన్ రావు మాట్లాడుతూ ఈసారి జరగబోయే ఎన్నికల



లో కాంగ్రెస్ పార్టీ నుండి మున్సిపల్ చైర్మన్ ఢ కౌన్సిలర్,జడ్పీటీసీ, ఎంపీటీసీ,సర్పంచ్ పదవులకు పోటీ చేస్తాము అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వస్తేనే అభివృద్ధి జరుగుతుందని అలాగే కూటమి ప్రభుత్వం వల్ల రైతులు చాలా నష్టపోతున్నారని అన్నారు . వర్షాలు లేక చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, పంట పొలాలకు నీరు కూడా లేవని, నీరు లేక రైతులు బాధపడుతున్నారు. రైతులకు అండగా నిలవని కూటమి ప్రభుత్వం ఎందుకు అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వము వల్ల ఎటువంటి అభివృద్ధి జరగదని తెలియజేశారు..

ఈ కార్యక్రమంలో నంద్యాల టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, పిసిసి మాజీ జనరల్ సెక్రటరీ చింతల మోహన్ రావు,జిల్లా ఉపాధ్యక్షుడు చాబోలి సలాం,ఇంచార్జి చాకలి పుల్లయ్య, రమేశ్, కుమార్, పుస్పరాజు,భాష మొదలగు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## గౌరు వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ నేతలు**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం మాధవినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ, 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన వధూవరులకు ఆశీర్వాదాలు

అనంతరం దిన్నెదేవరపాడు సమీపంలోని రాగమయూరి రిసార్ట్‌లో నిర్వహించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి తనయుడు డాక్టర్ పెరుగు సాయి ప్రణీత్ రెడ్డి, డాక్టర్ నైనా రెడ్డిల వివాహ రిసెప్షన్ వేడుకకు కమ్మరి పార్వతమ్మ, సుతారు రాఘవేంద్ర హాజరయ్యారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

## విద్యాభివృద్ధికి కూటమి పెద్ద పీట...ఎంపీ బస్తిపాటి నాగరాజు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎంపీ





బస్తిపాటి నాగరాజు అన్నారు..కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి బా పూలే బీ.సీ బాలుర గురుకుల పాఠశాలను పత్తికొండ ఎం.ఎల్.ఏ కే.ఈ శ్యామ్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు... ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ లు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులు పోస్టులను భర్తీ చేసిందన్నారు.. ఇక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీ తెలిపారు

# చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని,

**● ఏఈ పనేంద్ర ని కలిసి వినతిపత్రం అందజేసిన కాలనీ వాసులు, ● విద్యుత్ సరఫరా లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నమన్న కాలనీవాసులు, ● అంధకారంలో 40 కుటుంబాలు , ● సమస్య తీర్చాలని వేడుకుంటున్న డబల్ బెడ్రూం కాలనీ వాసులు**

పల్లె వెలుగు దినపత్రిక. కీసర: చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న విద్యుత్



సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీ వాసులు విద్యుత్ శాఖ ఏఈని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని ఇళ్లకు ఇప్పటివరకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ వినియోగంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి



ఇంటికి ప్రత్యేకంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బందులు పడకుండా అధికారులు స్పందించి విద్యుత్ మీటర్ల ఏర్పాటు, సరఫరా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ వాసుల వినతిని పరిశీలించిన ఏఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వనం దాస్ రమేష్ గౌడ్ జల్లి.గోపాల్,, మధు యాదవ్ లక్ష్మయ్య, గణేష్., రాహుల్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభకు పట్టం

**దొర్నిపాడు జడ్పీపాఠశాలలకు దక్కిన అవార్డు**

దొర్నిపాడుఆగస్టు 31 పల్లె వెలుగు న్యూస్ హాకీ దిగజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని



పురస్కరించుకొని ఆగస్టు 29న జిల్లా స్థాయి క్రీడల్లో విశేషప్రతిభకనబరిచినపాఠశాలలకు అందించే స్పోర్ట్స్ ఎక్సెన్స్ అవార్డునుదొర్నిపాడుజడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లో కనబరిచిన ప్రతిభకు పట్టంగ, మాపాఠశాల ఎంపికై అవార్డు దక్కిందని పాఠశాలప్రధానోపాధ్యాయురాలుచెన్న కేశ్వరిఅన్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి 149 పాయింట్లతో అవార్డు సాధించిందన్నారు




పాఠశాల నుండి 26 మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలోతైక్వాండో, బేస్బాల్ హ్యాండ్ బాల్, చెపక్ తక్రా సాఫ్ట్బాల్, క్రీడలలో పాల్గొని పథకాలు సాధించడం వలన ఈ అవార్డు రావడం జరిగిందని ఆమె అన్నారు, అవార్డు రావడానికి కృషి చేసిన పి,డి దేవేంద్రను ఉపాధ్యాయ బృందం అభినందించామన్నారు జాతీయస్థాయిలో అఖిల్ ప్రకాష్ తైక్వాండలో ,బేస్బాల్ మహమ్మద్ అఫ్రిది,తైక్వాండో రాష్ట్ర స్థాయి వంశి బంగారు పతకం, ఉమేరా వెండి పతకం శివ గౌతం కాంస్యం,శివపామని కాంస్యం, బేస్బాల్ రాష్ట్రస్థాయి చిట్టికల మొదటి స్థానం కుసుమాభి, సుభహాన్లు మొదటి స్థానం సాధించారన్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయబృందం, విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు,

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

# కార్యక్రమానికి 98 ఫిర్యాదులు..

**● ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించరాదని అధికారులకు ఆదేశాలు.. ● చట్ట పరిదిలో న్యాయం చేస్తామని ప్రజలకు భరోసా.. ● జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఫిర్యాదిదారుల నుంచి 98




ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో నంది కోలోత్సవం.. మార్మోగిన 'అహో రుద్ర.. వీరభద్ర' నినాదాలు

**● వీరభద్రుని వేషధారణతో నంది కోలోత్సవం.. పెద్దహ్యాట్‌లో అంగరంగ వైభవం ● శివనామస్మరణతో మార్మోగిన పెద్దహ్యాట్..**



హొళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 31 హొళగుంద మండల పరిధిలోని పెద్దహ్యాట్ గ్రామంలో వెలసిన



శ్రీ వీరభద్రేశ్వర స్వామి నంది కోలోత్సవం సోమవారం అశేష భక్తజన సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి నుంచే ఆలయంలో భక్తులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు భజన కార్యక్రమాలు చేపట్టారు.సోమవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని బావి వద్ద గంగమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వీరభద్రేశ్వర స్వామి వేషధారణలో ఇద్దరు యువకులు "అహో రుద్ర.. వీరభద్ర.." అంటూ ప్రవచనాలు చెబుతూ, శాస్త్రాలు గుచ్చుకుంటూ నంది కోలోత్సవాన్ని గ్రామ పురవీధుల గుండా నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ నందికోలను ఆలయానికి తీసుకెళ్లారు.

ఆలయ పూజారులు పంపయ్యస్వామి, రాజయ్యస్వామిల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు స్వామివారికి రుద్రాభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్నేళ్లుగా నంది కోలోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్రేశ్వర స్వామి ప్రత్యేక పూజలు

**ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన టీడీపీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్**





హొళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 31 హొళగుంద మండలం పెద్దహ్యాట గ్రామంలో కొలువుదీరిన శ్రీ వీరభద్రేశ్వర స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఈబీజీ గోవింద్ గౌడ్ భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి పూజలు సమర్పించారు. అనంతరం గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని స్వామివారిని ప్రార్థించారు. ఈబీజీ గోవింద్ గౌడ్ ఆలయానికి చేరుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూలహారంతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా ఈబీజీ గోవింద్ గౌడ్ మాట్లాడుతూ.. పెద్దహ్యాట గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయాలకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రామంలో నిర్వహించే దేవాలయ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉంటుందని పేర్కొన్నారు. శ్రీ వీరభద్రేశ్వర స్వామివారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, పెద్దహ్యాట్ గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పంపయ, మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, స్వామి, మలయ్య, వీరేష్, రాము, తిరుపతి, బసవ, కనయ్య, రామతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి.

**☛పిజిఆర్ఎస్ కు 272 ప్రజా దరఖాస్తులు.**
**☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలను రీఓపెన్ కాకుండా ఉండే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క అర్జీదారుడి దరఖాస్తును నాణ్యతతో పరిష్కరించేలా కృషి చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా అన్ని దరఖాస్తులను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అర్జీలకు సంబంధించి 5,513 రీఓపెన్ కాగా 5,444 నాణ్యతతో పరిష్కరించామని మిగతా 69 వాటిని కూడా అర్జీదారుడితో మాట్లాడి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. రీఓపెన్ దరఖాస్తుల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అత్యధికంగా రీఓపెన్ కావడం జరిగిందని సంబంధిత శాఖలు దృష్టి సారించి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 137 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 137 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 16, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 6, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 25, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 35, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 40, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) బనగానపల్లె మండలం, కటికవనికుంట గ్రామానికి చెందిన వాడల సావిత్రి తన భర్త అనారోగ్యంతో మరణించారని, వితంతు పెన్షన్ మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) వెలుగోడు మండలం, వెలుగోడు గ్రామానికి చెందిన వి.మధు సతీష్ తను పుట్టుకతోనే చూపులేనప్పటికీ డిగ్రీ విద్యను అభ్యసించడం జరిగిందని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు గురవుతున్నామని, విద్యార్హత మేరకు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

3) సిరివెళ్ళ మండలం, గుండంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న స్మశానాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపికకు పకడ్బందీ ప్రతిపాదనలు సమర్పించాలి.



**● 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డుల పోటీల్లో నంద్యాల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి. ● జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం ఉత్తమ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ● పరిశీలనకై ఐదుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖలు, సంస్థలు చురుగ్గా పాల్గొని, ఉత్తమ ప్రతిపాదనలను నిర్దేశిత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం స్వచ్ఛాంధ్ర అవార్డులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించిన 21 అంశాలలో 66 రాష్ట్ర స్థాయి అవార్డులు, 1,662 మంది జిల్లా స్థాయి అవార్డులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అత్యధిక అవార్డులు దక్కేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అవార్డుల స్క్రూటినీ మరియు పర్యవేక్షణ కోసం డిఆర్డిఎ పిడి, పిడి మెప్మా, డిప్యూటీ సీఈఓ, నంద్యాల మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారిలతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెల్ఫ్ అసెస్మెంట్ నివేదికల సమర్పణకు ఆగస్టు 31 చివరి తేదీ కాగా, అన్ని ప్రతిపాదనలు తక్షణమే డిప్యూటీ సీఈఓకు అందజేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సెప్టెంబర్ 8వ తేదీ నాటికి వీటిని క్షుణ్ణంగా పరిశీలించి 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్'కు నివేదిస్తుందని, అనంతరం థర్డ్ పార్టీ బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవార్డులను ఖరారు చేస్తుందన్నారు. ప్రతిపాదనలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ మరియు ఫొటోలు, రికార్డులు పక్కాగా ఉండాలని, స్వచ్ఛత కోసం చేపట్టిన పనులను స్పష్టంగా వివరించాలన్నారు.

**వివిధ విభాగాల్లో అవార్డుల వివరాలు:-**

స్వచ్ఛ మున్సిపాలిటీలు: జిల్లాలోని 6 మున్సిపాలిటీల కమిషనర్లు సమగ్ర నివేదికలు అందించాలి (రాష్ట్ర స్థాయిలో 6, జిల్లా స్థాయిలో 1 అవార్డు).

స్వచ్ఛ గ్రామ పంచాయతీలు: రాష్ట్ర స్థాయి 6, జిల్లా స్థాయి 5 అవార్డులు.

స్వచ్ఛ సెల్ఫ్ లు (మెప్మా): రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 3 అవార్డులు. స్వచ్ఛ గ్రామ సమాఖ్యలు : రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 5 అవార్డులు. స్వచ్ఛ పాఠశాలలు: రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 5 అవార్డులు. స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలు: రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 5 అవార్డులు. స్వచ్ఛ ఆసుపత్రులు: రాష్ట్ర స్థాయి 4, జిల్లా స్థాయి 3 అవార్డులు.

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు: కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 3 అవార్డులు. స్వచ్ఛ ఆర్టీసీ బస్ స్టేషన్లు: రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 1 అవార్డు. స్వచ్ఛ రైతు బజార్లు: రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 1 అవార్డు.

స్వచ్ఛ సంక్షేమ వసతి గృహాలు ( ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనారిటీ): రాష్ట్ర స్థాయి 4, జిల్లా స్థాయి 4 అవార్డులు.

స్వచ్ఛ ఎంఎస్ఎంఈలు : రాష్ట్ర స్థాయి 3, జిల్లా స్థాయి 3 అవార్డులు. స్వచ్ఛ ఎన్‌జీవోలు : రాష్ట్ర స్థాయి – 3, జిల్లా స్థాయి – 3 అవార్డులు. స్వచ్ఛ వారియర్స్ (శానిటేషన్ – అర్బన్): రాష్ట్ర స్థాయి – 3, జిల్లా స్థాయి – 5.

స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్స్: రాష్ట్ర స్థాయి – 3, జిల్లా స్థాయి – 5 అవార్డులు. స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలలు (ట్రైబల్, బీసీ, సోషల్ వెల్ఫేర్) : రాష్ట్ర స్థాయి – 3, జిల్లా స్థాయి – 1 అవార్డులు. స్వచ్ఛ కాలనీలు : రాష్ట్ర స్థాయి – 3, జిల్లా స్థాయి – 1 అవార్డులు. పర్యాటక ప్రాంతాలు: రాష్ట్ర స్థాయి – 1, జిల్లా స్థాయి – 1 అవార్డులు.

ప్రముఖ దేవాలయాలు: రాష్ట్ర స్థాయి – 1, జిల్లా స్థాయి – 1 అవార్డులు. బెస్ట్ రైల్వే స్టేషన్: రాష్ట్ర స్థాయి – 1, జిల్లా స్థాయి – 1 అవార్డులు. నామినేషన్లు పూర్తి వివరాలు మరియు కలర్ ఫొటోలతో కూడిన నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# పట్టణ ప్రజలకు 24 గంటల స్వచ్ఛమైన తాగునీరు,,

**-157.3 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన,,**







ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 31 స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు 24 గంటల స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న మాజీ మంత్రివర్యులు స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనివాస్ టాకీస్ సర్కిల్ వద్ద ?157.3 కోట్ల విలువైన సమగ్ర తాగునీటి సరఫరా మెరుగుదల పథకానికి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రజారోగ్య మరియు పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ఖణ×ఖీ ుతీఖుఅప్ట్రవ-×× (2024--25) కింద చీసీదీ రుణ సహాయంతో ఈ పథకం అమలు కానుంది.

ఈ పనులను చీజజ ూఅఎ్‌వస, హైదరాబాద్ సంస్థ చేపట్టనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు 24 గంటల నిరంతర, స్వచ్ఛమైన తాగునీరు అందించడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారానికి బాటలు వేస్తుందని అన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధికి మూడు అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. మొదటిది ప్రతి ఇంటికీ 24 గంటల తాగునీరు, రెండవది రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, మూడవది ఇంటిగ్రేటెడ్ హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు ద్వారా స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడం" అని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మిగనూరు చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించి, చేనేత కార్మికులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇంటిగ్రేటెడ్ హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ పార్క్ కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మైనారిటీ కాలనీకి వెళ్లి తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ మసీదులో ప్రార్థనల్లో పాల్గొని, ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, చీ= భరోసా పెన్షన్లు, దీపం పథకం, స్త్రీ శక్తి ఉచిత బస్సు తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కార్యరూపంలోకి తీసుకువస్తున్నాం. మాటల్లో కాదు.. చేతల్లో అభివృద్ధి చూపించడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. గురప్ప యాదవ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు మరియు సభ్యులు, పట్టణ కమిటీ అధ్యక్షులు మరియు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ఫ్రాంచైజీ ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి,

**● వేదాంత్, అలెన్, రీజనౌన్స్, బాన్సాల, నానో తదితర సంస్థలపై కలెక్టర్‌కు ఫిర్యాదు,, ● దీజ, ూజ, ూు, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య, ఖూఖీ× డిమాండ్**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 31 కర్నూలు: ప్రభుత్వ నిబంధనలు, ఇంటర్ విద్యాశాఖ అనుమతులకు విరుద్ధంగా ఫ్రాంచైజీ పేరుతో నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంటర్ కళాశాలలపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు లేనట్లు తేలితే తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ దీజ, ూజ, ూు, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య, ఖూఖీ× విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి ఫిర్యాదు చేశారు.

కర్నూలు నగరంలో వేదాంత్, అలెన్, రీజనౌన్స్, బాన్సాల, నానో తదితర పేర్లతో నిర్వహిస్తున్న విద్యా సంస్థలు/ఇంటర్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు, అఫిలియేషన్, భవన అనుమతులు, షిఫ్టింగ్ అనుమతులు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా దీజ, ూజ, ూు, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు శేఖర్ నాయుడు, ఖూఖీ× రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ మాట్లాడుతూ, కొన్ని సంస్థలు ఫ్రాంచైజీ పేరుతో ఇంటర్ విద్యార్థులను చేర్చుకుంటున్నాయని, సంబంధిత కళాశాలలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టంగా పరిశీలించాలని కోరారు. అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే సంబంధిత సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో సాధించిన విద్యార్థుల మార్కులు, ఫలితాలను ప్రచారంలో ఉపయోగించి తల్లిదండ్రులను ఆకర్షిస్తూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరపాలని కోరారు. కొన్ని సంస్థలకు ఒక ప్రాంతంలో భవన అనుమతి లేదా విద్యా అనుమతి ఉండి, మరో ప్రాంతంలో వేరే పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయా? సంబంధిత షిఫ్టింగ్/స్థల మార్పు అనుమతులు పొందారా? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించాలని తెలిపారు. అలాగే ప్రతి కళాశాలకు సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి, అఫిలియేషన్, కోర్సుల అనుమతి, విద్యార్థుల అడ్మిషన్ సామర్థ్యం, భవన అనుమతులు, ఫైర్ సేఫ్టీ, శానిటేషన్, సిబ్బంది వివరాలు, ఫీజు వసూళ్లు, ఫ్రాంచైజీ ఒప్పందాలు తదితర అంశాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం మరియు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసి అన్ని సంస్థలపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనుమతులు లేని కళాశాలలు ఉన్నట్లు అధికారిక విచారణలో నిర్ధారణ అయితే వాటిని సీజ్ చేయడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ విద్యా ఏర్పాట్లు చేయాలని కోరారు.


# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 31 ఎమ్మిగనూరులో గ్రాండ్ సక్సెస్.. ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇంటింటికి తెలుగుదేశం.. పట్టణంలో ని



158 భూత్ లో ఈ రోజు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలో ని 16 వ వార్డు క్లస్టర్ 10 ఇంచార్జ్ దాదా సాహెబ్ టీడీపీ వార్డు ప్రధానకార్యదర్శి కెఎండి ఫరూక్ టీడీపీ కార్యకర్తలు ముమ్మరంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి అలాగే ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి ని వారి స్పష్టంగా వివరించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాండ్ సక్సెస్ అయిందని వారు స్పష్టంచేశారు

# ఎస్. కొత్తూరు టెంపుల్ అర్చకులు నారాయణ శర్మగారి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి .



పల్లె వెలుగు పాణ్యం. పాణ్యం మండలం లోని ఎస్. కొత్తూరు టెంపుల్ అర్చకులు నారాయణ శర్మ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నారాయణ శర్మ కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నారాయణ శర్మ కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు.

# పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయునికి ఘనంగా వీడ్కోలు.

రుద్రవరం.పల్లె వెలుగు: మండల పరిధిలోని పెద్దకంబలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య సోమవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య దంపతులను పూలమాలవేసి శాలువతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయునికి పదవీ విరమణ సర్వసాధారణమన్నారు.మా పాఠశాల యందు ప్రధానోపాధ్యాయుడైన తిరుపతయ్య మా అందరితో స్నేహ స్వభావం కలిగి కలిసిమెలిసి విధులు నిర్వహించేవాడని. విద్యార్థుల పట్ల మంచితనంతో వారికి నడవడికను నేర్పుతూ పాఠశాలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లారన్నారు. పాఠశాలకు ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన మంచితనాన్ని ఉపాధ్యాయులు అందరూ స్మరించుకున్నారు. పదవీ విరమణ పొందిన అనంతరం ఆయన పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఆడుతూ పాడుతూ జీవించాలని మనసారా కోరుకుంటూ మా పాఠశాల తరఫున వీడ్కోలు పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.




# రిజర్వాయర్ ముట్టడికి భగ్నం చేసే యత్నాలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 31 : వెలుగోడు రిజర్వాయర్ ను 500 ట్రాక్టర్లతో సెప్టెంబర్ 1న ముట్టడి చేస్తామని శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి ప్రకటించిన మేరకు, రిజర్వాయర్ ముట్టడికి భగ్నం చేసే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. శ్రీశైలం జలాశయంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నప్పటికీ, వెలుగోడు రిజర్వాయర్ లో ఆశించిన స్థాయిలో నీరు ఉన్నప్పటికీ తాగునీరు సాగునీరు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ ఉందని చక్రపాణి రెడ్డి గత కొన్ని రోజులుగా ఆరోపిస్తూ ఉన్నారు. పది రోజుల క్రితమే శ్రీశైలం నియోజకవర్గం లోని వెలుగోడు ఆత్మకూరు బండి ఆత్మకూరు మహానంది మండలాల్లో పర్యటించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు వరిమళ్లు వేసి 40 రోజులు పైబడుతున్నప్పటికీ తెలుగు గంగ, కేసీ కాలువలకు నీరు వదలడం లేదని, ఈ కారణంగా పొలాలు బీటలు బారిపోయి, ఎండిపోయే దశకు చేరుకున్నాయని పంట పొలాలను పరిశీలించి గుర్తించారు. నీటి విడుదల విషయంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ, రిజర్వాయర్ ముట్టడికి రైతులు సంసిద్ధం కావాలని చక్రపాణి రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు వేలాదిగా వెలుగోడు రిజర్వాయర్ ముట్టడికి ట్రాక్టర్ల ద్వారా తరలివచ్చి తమ నిరసన గలాన్ని వినిపించాలని కూడా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ ముట్టడి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పోలీసు శాఖకు ప్రభుత్వం ఆదేశించినట్లుగా తెలుస్తుంది. ఈ మేరకు గత రెండు రోజుల నుండి ఆత్మకూరు వెలుగోడు బండి ఆత్మకూరు మహానంది మండలాలకు చెందిన ట్రాక్టర్ యజమానులకు పోలీసులు నోటీసులు ఇచ్చే పనిలో మునిగితేలుతున్నారు. రిజర్వాయర్ ముట్టడికి ముందస్తు అనుమతులు లేవు కాబట్టి, ముట్టడి ప్రయత్నాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాక్టర్ యజమానులకు ఇచ్చిన నోటీసులలో పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల నోటీసులతో ట్రాక్టర్ యజమానులు ఆందోళనలో పడ్డారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే చక్రపాణి దృష్టికి రావడంతో పోలీసుల వైఖరిని తప్పుపడుతున్నారు. పోలీసులు ట్రాక్టర్లను అడ్డుకుంటే, ఆటోల ద్వారా రావాలని వాటిని కూడా అడ్డుకుంటే మోటార్ సైకిళ్లపై రావాలని, లేనిపక్షంలో పాదయాత్రగా నైనా రైతులు తరలిరావాలని సోమవారం నంద్యాలలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో చక్రపాణి రెడ్డి ప్రకటించారు. వీటన్నిటికీ పోలీసులు అడ్డు చెబితే, గ్రామాలలో వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలపాలని కూడా ప్రకటించారు. రైతులు ఇప్పటికే వరి సాగు కోసం వేల రూపాయలను ఖర్చు పెట్టడం జరిగిందని, రైతులు వేసుకున్న పంటలు చావు బతుకుల ముందు కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిలా ఉన్నాయని, చనిపోయే వాడి నోట్లో తులసి నీళ్లు పోయమన్నట్లుగా, ఎండిపోతున్న పంటలకు సాగునీరు వదిలి జీవం పోయాలని అభ్యర్థిస్తున్నామని చక్రపాణి రెడ్డి ప్రకటించడం జరిగింది. రైతులు వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడి చేయకుండా ఉండేందుకు పోలీసు శాఖ ప్రయత్నాలు చేస్తూ ఉంది. ప్రధాన రహదారులలో పోలీసు బందోబస్తు నిర్వహించి, రైతుల ముట్టడి యత్నానికి అడ్డుకట్ట వేయాలని చర్యలు చేపట్టడంలో తల మునకలు అవుతూ ఉన్నారు. ప్రధాన రహదారులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రైతులు రిజర్వాయర్ వద్దకు వెళ్లకుండా ఆపాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

### అంతా ఎల్నినో ప్రభావమే

ఎల్లినో ప్రభావం కారణంగా ఆశించిన స్థాయిలో ఈ ఏడాది వర్షాలు కురియకపోవడంతో ఎన్నడు లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్లో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఎల్లినో కారణంగా వర్షాలు పడే పరిస్థితులు లేవని రైతాంగం వరి సాగుకు స్వస్తి చెప్పి, ఆరుతడి


పోలీసు నోటీసు

ఇందు మూలంగా క్రింద తెలిపిన బండి ఆత్మకూరు మండల గ్రామాలకు చెందిన వ్యక్తులకు తెలియజేయడం ఏమనగా 01.09.2026వ తేదిన జరగబోవు వెలుగోడు గ్రామం దగ్గర గల వెలుగోడు తెలుగు గంగ రిజర్వాయర్ మరియు పాములపాడు మండలము బానుకచర్ల గ్రామము వద్దగల పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ ముట్టడికి మీకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేనందున మీరు ఆ ముట్టడి కార్యక్రమములో పాల్గొనరాదని ముందస్తుగా ఈ నోటీసు ద్వారా తెలియజేయుచున్నాము. ఈ నోటీసు ముట్టిన తరువాత కూడా మీరు పై తెలిపిన కార్యక్రమములలో పాల్గొన్నచో మీ పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఈ నోటీసు ద్వారా తెలియజేయుచున్నాము.

Sub-Inspector of Police
Bandi Atmakur P.S
NANDYAL (Dist.)

పంటలు మాత్రమే వేసుకోవాలని గత రెండు నెలల కాలం నుండి జిల్లా కలెక్టర్ రైతులకు సూచించడం జరిగింది. డిసెంబర్ నాటికి కూడా వర్షాలు పడే పరిస్థితులు కూడా లేవని వాతావరణ శాఖ మరోవైపు హెచ్చరిస్తూనే ఉంది. రైతులు ఈ విషయంలో తగ్గేదేల్యా అంటూ వరి సాగుకు పూనుకున్నారు. శ్రీశైలం డ్యాం లో, వెలుగోడు తెలుగుగంగ రిజర్వాయర్లో ఆశించిన స్థాయిలో నీళ్లు ఉన్నాయని, ఏ క్షణంలో నైనా నీళ్లు వదలక పోతారా అని రైతులు మొన్నటి వరకు ఆశగా ఎదురు చూశారు. కేవలం తాగునీటి కొరకు మాత్రమే నీళ్లు నిలువ చేయడం జరిగిందని అధికారులు చెబుతున్నప్పటికీ రైతులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. రైతులకు సాగునీరు తాగునీరు విడుదల చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ వెలుగోడు రిజర్వాయర్ ముట్టడికి రైతులకు పిలుపునిచ్చింది. నీటి విడుదల విషయంలో రైతుల సానుభూతిని సంపాదించేందుకు వైసిపి పార్టీ ప్రయత్నాలు చేస్తూ ఉందన్న విషయం చర్చకు దారి తీస్తూ ఉంది.

### నీటి విడుదలకు అనుమతులు రాలేదు

సాగునీరు తాగునీటి విషయంలో విడుదలకు సంబంధించి ఎలాంటి అనుమతులు రాలేదని నీటిపారుదల ఉన్నత శాఖాధికారి ఒకరు పేర్కొన్నారు. నీటి విడుదల విషయంలో జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ చర్చలు జరుపుతున్నారు అన్న వదంతులు వ్యాపించాయి. చివరకు నీటి విడుదల విషయం వట్టి పుకార్లేనన్న విషయం తేలింది.

## నల్లమల్ల ఘాట్‌లో తప్పిన ప్రమాదం




మహానంది, పల్లె వెలుగు నంద్యాల-గిద్దలూరు రహదారి నల్లమల ఘాట్‌లో ప్రమాదం తప్పింది. సోమవారం గిద్దలూరు నుంచి నంద్యాలకు ఐరన్ లోడుతో లారీ వస్తోంది. దిమ్మెల మలుపు వద్ద బ్రేకు వేయగా ప్రమాదవశాత్తు వెనుక వైపు ఉన్న ఇనుప చువ్వలు మొత్తం లారీ క్యాబిన్‌లోకి చొచ్చుకొచ్చాయి. ఆ సమయంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా రోడ్డు విభాగం పోలీసులు చర్యలు చేపట్టారు.

## తుర్కు యూనివర్సిటీ ప్రశంసా పత్రాన్ని అందుకున్న బండి పరిమళ జ్యోతి

కాశినాయన, ఆగస్టు 31 ( పల్లె వెలుగు):రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు విద్యా విషయక అంశాల పరిశీలన నిమిత్తం ఫిన్లాండ్ వెళ్ళిన విద్యా విషయక పర్యటన విజయవంతమైందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని బండి పరిమళ జ్యోతి తెలిపారు. ఆగస్టు 17 నుండి ఫిన్లాండ్ లోని తుర్కు యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ పర్యటన కార్యక్రమం విజయవంతమైనది పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో రాష్ట్రం



నుండి 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ బృందం ఈనెల 16న ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన విషయం విధితమే. అయితే అక్కడ ఈనెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పలు విద్యావిధానాలపై పూర్తి అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన కాశి నాయన మండలం రెడ్డి కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎస్ జి టి గా విధులు నిర్వహిస్తున్న హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ బండి పరిమళ జ్యోతిని తుర్కు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ , పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండి పరిమళ జ్యోతి మాట్లాడుతూ ఈ పర్యటన ఎంతో అనుభూతినిచ్చిందని ఇంతటి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

## నంద్యాల జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ ( ఎన్ సి ఓ ఆర్ డి) కమిటీ సమావేశం.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లాలో



మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఐఏఎస్., మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్, ఐపీఎస్., వారి ఆదేశాలమేరకు 31.08.026 న సాయంత్రము 4.30 గంటలకు కలెక్టరేట్‌లోని వి సి హాల్‌లో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఎస్. ఖాదర్ బాషా అధ్యక్షతన జిల్లా స్థాయి ఎన్ సి ఓ ఆర్ డి సమావేశం నిర్వహించబడింది.

సమావేశంలో ఎక్సైజ్, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ, రైల్వే, రవాణా, మహిళా మరియు శిశు సంక్షేమం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో జిల్లాను డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

విద్యాసంస్థలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి, 2026--2029 మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాట్లు చేసి వారికి కూడా




అవగాహన కల్పించి పిల్లలను గమనిస్తూ వుండాలని, విద్యార్థులకు డ్రగ్-ఫ్రీ ప్రతిజ్ఞలను చేపించి మాదకద్రవ్యాల నిర్మూలనలో వారిని భాగస్వాములను చేసి దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

విద్యాసంస్థల పరిసరాలను 500 మీటర్ల పరిధిలో "మాదకద్రవ్య రహిత ప్రాంతం"గా అభివృద్ధి చేయడంతో పాటు, విద్యాసంస్థల చుట్టూ 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయం, వినియోగాన్ని నిరోధిస్తూ సి ఓ టి పి ఏ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు.

డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానము వారికి డ్రగ్ డిటెక్టివ్ కిట్స్ ఉపయోగించి,మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గుర్తించిన వారికి కౌన్సెలింగ్ అందించి, అవసరమైతే డీ-అడిక్షన్ ఒ పునరావాస కేంద్రాలకు పంపించి, వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు, నిఘా మరింత పెంచడంతో పాటు, అలవాటుగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పి ఐ టి ఎన్ డి పి ఎస్ చట్టం, 1988 కింద చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డ్రోన్ సర్వైలెన్స్, సీసీటీవీ నెట్‌వర్క్, సీసీటీఎన్ఎస్, డేటా అనలిటిక్స్, హాట్‌స్పాట్ మ్యాపింగ్, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు విక్రయాలను ముందస్తుగా గుర్తించి అరికట్టాలని నిర్ణయించారు.

ఎక్సైజ్, రైల్వే, రవాణా శాఖలతో సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ కేంద్రాలను బలోపేతం చేయడం, అలాగే శికారిపేట, సిద్ధాపురం, ఆలేబాద్ తండా, చెంచు కాలనీలు వంటి సున్నిత ప్రాంతాల్లో అవగాహన, జీవనోపాధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజలు డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ -- 1972కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

అలాగే ప్రతి శాఖ ఒక సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నెలవారీ పురోగతి నివేదికలు సమర్పించాలని , అన్ని శాఖలు సమన్వయంతో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిర్దేశించిన కార్యాచరణను ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు ఎస్పీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

## అక్రమంగా వేసిన బోరును వెంటనే సీజ్ చేయాలి

కాశినాయన, ఆగస్టు 31 :వైయస్సార్ కడప జిల్లా



బద్వేల్ సబ్ డివిజన్ శ్రీ అవధూత కాశినాయన మండలం శివరామపాలగిరి గ్రామం ఎస్సీ మాల కులమునకు చెందిన బాల సుబ్బయ్య గారి లక్ష్మయ్య s/o రామయ్య అనువారికి 1986 సంవత్సరంలో సర్వేనెంబర్ 703/1 నందు డి పట్టా నెంబర్ 38/95 గా 5.00ఎకరములు వ్యవసాయభూమిని ప్రభుత్వం మంజూరు చేసి ఉన్నది.నాటి నుంచి 2010 వరకు సదరు భూమిని సాగు చేసుకొనుచున్నారు.అయితే 2010 లో చిన్నపు నారాయణమ్మ w/o సిద్ధారెడ్డి మురుకుటి నారాయణమ్మ w/o చెన్నకృష్ణారెడ్డి మధ్య సదరు భూమి విషయంలో వివాదం ఏర్పడడంతో 2010లో రెవిన్యూ వారు సదరు భూమిలో దిగవద్దని ఇరువురికి నోటీసులు జారీ చేయడం జరిగినది అప్పటినుండి ఇరువురము సాగు చేయలేదు. ప్రస్తుతం సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం లీడర్ గా కొనసాగుతున్న యంబడి పోలయ్య అను వ్యక్తి సదరు పొలం నందు దౌర్జన్యం గా దిగి పొలం నాది అని రాత్రికి రాత్రి బోరు వేసి సిపిఎం పార్టీని అడ్డుపెట్టుకుని అధికారులు మేనేజ్ చేస్తూ దౌర్జన్యానికి దిగుతున్నాడు.సదరు సమస్య విషయమై బాధితులు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షులు జక్కుల కిరణ్ మరియు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల ప్రసాదరావు మరియు సీనియర్ దళిత నాయకులు ముత్యాల చెన్నారాయుడు మరియు పలువురు ప్రజా సంఘాల నాయకులను సంప్రదించగా వారంతా కాశినాయన మండల తాసిల్దార్ కి వినతి పత్రం సమర్పించి అక్రమంగా బోరు వేసిన యంబడి పోలయ్య పై చట్టపరమైన చర్యలు తీసుకుని సదరు బోర్ ను వెంటనే సీజ్ చేయాలని కోరడం జరిగినది.అందుకు తాహసిల్దార్ స్పందిస్తూ రెండు రోజుల్లో విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాలమహానాడు జక్కుల కిషోర్,చాటకొండ రవి బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులతో దద్దరిల్లిన నంద్యాల జిల్లా కలెక్టరేట్..

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నేతృత్వంలో భారీ ప్రదర్శన.




**రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేత; 2 లేదా 3 రోజుల్లో నీరు అందిస్తామని కలెక్టర్ హామీ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

నంద్యాలలో ఉద్రిక్తత... రైతు కంటతడి... సాగునీరు అందక బీళ్లువారిన పొలాలు! తాగునీటి కోసం అల్లాడుతున్న జనం! ఈ సమస్యలన్నింటిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాలలో కదం తొక్కింది. సాగునీరు, తాగునీరు అందించాలనే డిమాండ్‌తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం అఖండ స్పందనతో హోరెత్తింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నాయత్వంలో వందలాది మంది రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణం జనసందోహంతో దద్దరిల్లింది. "రైతులకు నీరు ఇవ్వాలి... ప్రజలకు తాగునీరు అందించాలి" అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ మెంబర్ పి పి నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగారెడ్డి, సాయినాథ్ రెడ్డి, రైతులతో కలిసి చేసిన నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. "శ్రీశైలం ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉన్నా మన ప్రాంత రైతులకు సాగునీరు ఇవ్వడానికి ఈ కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదు? చెరువులు, కుంటలు ఎండిపోయి, పంటలు బీళ్లువారుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంతో, అధికారులే రైతుల కన్నీళ్లను చూసి నీటిని విడుదల చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి రెండు, మూడు రోజుల్లో నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ ప్రభుత్వం వైఖరిలో మార్పు రాకపోతే మా పోరాటం మరింత ఉధృతం అవుతుందిని శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరించారు!" ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసిపి నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు సర్పంచులు నంద్యాల గోస్పాడు మండలాల రైతులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల్లో నీరులేక కరువు తాండవిస్తోందని, అటువంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వంలో ఎటువంటి స్పందన కనిపించలేదని విమర్శించారు. నీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూపడంలేదన్నారు. రైతులతో కలసి కలెక్టరేట్ ముట్టడి చేసి, ధర్నా చేసి,రస్తారోకో చేసి అనేక విధాల నిరసనలు హోరెత్తిస్తేనే రైతుల సమస్యలు



పరిష్కారం కావడంలేదని, ప్రభుత్వం కళ్లు తెరిచేలా లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాలుగా భరోసాగా నిలిచామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టలో నీరు నిల్వ ఉన్నాకూడా మన ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదో చెప్పాలన్నారు. నీరు లేక చెరువులు, కుంటలు ఎండిపోయామని, పంటలు బీళ్లుబారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో నీరు ఉన్నా మనకు ఆ నీటిని విడుదల చేయలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇందతా ప్రభుత్వం అసమర్ధతను తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వంపై, ప్రభుత్వ పెద్దలపై, మంత్రులపై ఎటువంటి నమ్మకం లేదని కేవలం అధికారులు రైతుల కష్టాలను, కన్నీలను చూసి నీటిని విడుదల చేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల్లో అధికారులు పంటలు వేయకండని సూచిస్తున్నారని, అయితే రైతులకు ప్రత్యామ్నాయ భరోసా ఇవ్వడం లేదని, పంటల భీమా అమలు చేయడం లేదని, ఆరుతడి పంటలను సాగు చేయాలని అధికారులు చెబుతున్నారని అయితే వాటికి కూడా కనీసం నీరు అందించలేక పోయారన్నారు. సాగునీరు త్రాగు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో బహిర్గతంగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన సాగునీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలని జిల్లా కలెక్టర్కు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండు లేదా మూడు రోజుల్లో నీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతులను ఆదుకొనేందుకు, రైతుల పక్షాన నిలబడతామని, రైతుల గొంతుక అవుతామని తెలిపారు. రైతుల పక్షాన రైతుల కోసం పార్టీలకు అతీతంగా తమ మద్దతు పలుకుతామని స్పష్టంచేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు ఒక రైతు బిడ్డగా జిల్లా కలెక్టర్ స్పందించి నీటిని విడుదల చేస్తుందన్న ఆశతో ఉన్నామన్నారు. ప్రభుత్వం వైఖరిలో మార్పులేకుంటే, ప్రజల సమస్యలు, రైతుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు ఆగవని, నిరసనలు ఆగవని, మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతులు, యువత, ఉద్యోగులు ప్రతి ఒక్క వర్గం వారు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని ఇది ప్రభుత్వం నిర్లక్షవైఖరికి





నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ జరగాలంటే రైతన్నలు పంటలు పండిచాలని, పంటల సాగుకు నీరు అందించాలని కోరారు. రైతులకు అవసరమైన వాటిని అందించలేని ప్రభుత్వం మద్యం మాత్రం డోర్ డెలివరీ చేస్తున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొన్నదని విమర్శించారు.

## నీటి ఎద్దడి దృష్ట్యా చిన్న మట్టి వినాయకులను పూజించాలి.

- నిమజ్జనం సమయంలో ఎటువంటి అపశ్రుతికి తావు ఉండకూడదు.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఎల్నినో ప్రభావం దృష్ట్యా ఏర్పడిన నీటి పరిమాణం తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న మట్టి వినాయకులను పూజించాలి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించాల్సిన మండల స్థాయి సమన్వయ సమావేశంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....వినాయక చవితి పండుగ 14వ తారీఖున ఉన్నందున జిల్లాలో ఇప్పటి వరకే జిల్లా స్థాయి సమన్వయ సమావేశం పూర్తి అవ్వడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో ఆర్డీవోలు (ఆర్డీవోలు), డీఎస్పీలు (డీఎస్పీలు), డివిజనల్ స్థాయి అధికారులు వెంటనే డివిజనల్ లెవెల్ మీటింగ్‌లు, గ్రామ స్థాయి మీటింగ్‌లు నిర్వహించాలన్నారు. వినాయక నిమజ్జనం ప్రధానంగా 5వ రోజున జరుగుతోందని, కొన్ని మండలాల్లో 3వ రోజు, 4వ రోజు లేక అదే రోజే నిమజ్జనం చేయడం జరుగుతోందన్నారు. ఏ మండలాల్లో ఏ రోజు చేస్తారనే విషయాన్ని పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెద్ద సమస్య నీళ్ల లేకపోవడం అని వినాయకుడిని నిమజ్జనం చేయడానికి కాలువల్లో, ట్యాంకుల్లో నీళ్ల తక్కువగా ఉన్నాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్న మట్టి వినాయకులను పూజించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్ద విగ్రహాలు పెడితే విద్యుత్ తీగల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విగ్రహాల వద్ద అనధికారికంగా విద్యుత్ లాగడం వంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో చర్చించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

నీటి కొలనలు లేని చోట తాత్కాలిక చెరువు తవ్వి, నీరు నింపి క్రేన్ ద్వారా నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ దీనికి బాధ్యత వహించాలన్నారు. చాలా ఘాట్ల వద్ద చిన్న పిల్లలు విగ్రహాలను తీసుకువెళ్లి ప్రమాదవశాత్తు జారి పడిపోయే అవకాశం ఉన్నందున ఘాట్ల వద్దకు దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయడం, చుట్టూ బ్యారికేడింగ్ వేయడం, సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం స్థానిక సంస్థల బాధ్యత అన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజనీర్లే దీనికి ప్రత్యేకాధికారులుగా ఉంటారన్నారు. మండల స్థాయి అధికారుకట్మండలాల్లో ఘాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ తగిన భద్రత, లైటింగ్ ఉండేలా చూడాలని, ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకూడదని, అవసరమైన చోట్ల నీరు నింపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదులు, చర్చిల ముందు ఊరేగింపు ఎలా వెళ్లాలనే విషయాలపై స్పష్టత ఉండాలన్నారు.

## సెప్టెంబర్3 నుండి 6 వరకు గ్రామ సభలు



రుద్రవరం.పల్లె వెలుగు : మండల పరిధిలోని గ్రామపంచాయతీలలో ఈనెల 3 నుండి 6 వరకు ఓటరు జాబితా పై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్చార్జి ఎంపిడిఓ బాలాంజనేయులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని గ్రామసభల ద్వారా ఓటర్ జాబితా బహిరంగ ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బంది గుర్తించిన ఎస్సీ ఎస్టీ బీసీ లో ఓటర్ జాబితాలో ఆ వర్గాల వారు ఏవైనా సమస్యలు పొరపాట్లు ఉన్నట్లయితే గ్రామ సభలో ఫిర్యాదు చేయాలన్నారు. వారి ఫిర్యాదు స్వీకరించి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి ఎంపీడీవో తెలిపారు.

## తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం

రుద్రవరం.పల్లె వెలుగు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను భర్తీ చేసేందుకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించినట్లు మండల



విద్యాశాఖ అధికారి వెంకటస్వామి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 - 27 విద్యాసంవత్సరానికి సంబంధించి 12 మందిని అకాడమిక్ ఇన్స్టక్టర్లుగా నియమించడం జరిగినదన్నారు. దేగల అరుణ ప్రాథమిక పాఠశాల పెద్దకంబలూరు, చెల్లా పావని ప్రాథమిక పాఠశాల నాగిరెడ్డిపల్లె, కుమ్మరి వెంకట సుదర్శన్ ప్రాథమిక పాఠశాల చిలకలూరు, వాసగిరి జంబులమ్మ ప్రాథమిక పాఠశాల టీ లింగందిన్నె, పన్నెగట్ల కాశీం ప్రాథమిక పాఠశాల టి లింగందిన్నె, మిద్దూరి నిర్మల ప్రాథమిక పాఠశాల స్పెషల్ మందలూరు, సూరబోయిన వరమహాలక్ష్మి ప్రాథమిక పాఠశాల తిమ్మనపల్లె, పాణ్యం వేణుగోపాల్ ప్రాథమిక పాఠశాల చిత్రేనిపల్లె, వడ్డే మణిజ్యోతి ప్రాథమిక పాఠశాల ఆలమూరు తిప్ప, బైరం భారతి ప్రాథమికోన్న పాఠశాల ముకుందాపురం, మదర్ వలి షేక్ ప్రాథమికోన్నత పాఠశాల రుద్రవరం, కాకి శ్వేతా మాధురి ప్రాథమికోన్నత పాఠశాల నరసాపురం నియమించడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు పాల్గొన్నారు.

## మాదిగ ఇనాం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

పోరుమామిళ్ల, ఆగస్టు 31( పల్లె వెలుగు



)మండలంలోని అక్కలరెడ్డిపల్లె గ్రామంలో మాదిగలకు చెందిన ఇనాం భూమిని కొందరు ఇతరులు ఆక్రమించారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన మాదిగలు సోమవారం గ్రీవెన్స్‌లో పోరుమామిళ్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు దాసరపల్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. అక్కలరెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 1326బీ, 1326దీలో సుమారు 7 ఎకరాల 30 సెంట్ల మాదిగ ఇనాం భూమి ఉందన్నారు. నిరక్షరాసులైన మాదిగలకు సమాచారం లేకుండా కొందరి పేర్లపై భూములను నమోదు చేశారని ఆరోపించారు.ఎస్సీలకు చెందిన భూములను ఎస్సీలకు కాకుండా ఇతరుల పేర్లపై ఆన్‌లైన్ చేయడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. అర్హులైన మాదిగలకు న్యాయం జరిగేలా ఇనాం భూమిపై సమగ్ర విచారణ జరిపి, భూమిని మాదిగలకే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాదిగలకు న్యాయం జరగని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని కిరణ్ కుమార్ హెచ్చరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్.. భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించి, ఇరువర్గాల సమక్షంలో సెప్టెంబర్ 9న ఆధారాల ఆధారంగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాగిపోగు బాలు మాదిగ, లక్కినేని బాబు మాదిగతో పాటు అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మోహన్, ఆరోగ్యం, గురయ్య, సుబ్బరాయుడు, సునీల్, మధు, తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

## భక్తులకు చేసే సేవలతోనే గుర్తింపు:ఏఈవో మధు

మహానంది, పల్లె వెలుగు ప్రతి ఉద్యోగి భక్తులకు అందించిన మంచి సేవలతోనే గుర్తింపు



వస్తాయని ఆలయ ఏఈఓ మధు పేర్కొన్నారు.వి. లక్ష్మీనారాయణ శ్రీశైలం నుంచి బదిలీపై మహానంది దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు.సోమవారం పదవీ విరమణ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ దంపతులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతోని దేశానికి కీర్తి కిరీటాలు: అసోసియేట్ డీన్

మహానంది, పల్లె వెలుగు క్రీడలతోనే దేశానికి కీర్తి కిరీటాలని మహానంది వ్యవసాయ






కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. చవాన్ శ్యామ్ రాజ్ నాయక్ పేర్కొన్నారు. మహానంది ఫారంలోని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడలు నిర్వహించారు. గత మూడు రోజులుగా జరిగిన బాల్, షటిల్ బాడ్మింటన్స్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించి బహుమతులు అందజేశారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ..హాకీ స్టిక్‌తో తన అసాధారణ నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ధ్యాన్‌చంద్, భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.1928లో ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్‌లో, 1932లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో, 1936లో బెర్లిన్ ఒలింపిక్స్‌లో మూడుసార్లు భారతదేశానికి పథకాలు తెచ్చిన ఘనుడని కొనియాడారు. ఆటగాడిగా మాత్రమే కాకుండా, దేశం కోసం అత్యున్నత స్థాయిలో పోరాడిన క్రీడాకారుడిగా ఆయన పేరు భారతీయుల క్రీడా స్ఫూర్తికి ప్రతీకగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# 35 ఏళ్ల సేవకు వీడ్కోలు

**రిటైర్ అయిన డ్రాయింగ్ టీచర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డికి ఘన సన్మానం**



నంద్యాల పల్లె వెలుగు వ్యవసాయ విలేఖరి ఆగస్టు 31: నంద్యాల పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా సుమారు 35 సంవత్సరాల పాటు సేవలందించిన ఎస్. విజయభాస్కర్‌రెడ్డి 62 ఏళ్ల వయసులో ఉద్యోగ విరమణ పొందారు. విజయభాస్కర్‌రెడ్డి గతంలో ఆధోని లోని మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం గత ఎనిమిది సంవత్సరాలుగా టెక్కే మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా తన సేవలను కొనసాగించారు. విద్యార్థులకు డ్రాయింగ్ విద్యను అందించడంతో పాటు సహచరులతో, అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ మంచి పేరు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పదవీ విరమణను పురస్కరించుకుని సన్నిహితులు, సహచరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్‌రెడ్డి, హిందీ టీచర్ హుస్సేన్‌బాషా, నంది పత్రిక అగ్రికల్చర్ రిపోర్టర్ సమీర్ బాషా తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డిని శాలువా కప్పి హృదయపూర్వకంగా సత్కరించి, ఆయన అందించిన సేవలను అభినందించారు. 35 ఏళ్ల పాటు విద్యారంగంలో సేవలందించిన ఆయనకు భవిష్యత్తు జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

## పోరుమామిళ్లలో 30 మంది విద్యార్థులతో ఏబీవీపీ నూతన నగర కమిటీ ప్రకటన...

పోరుమామిళ్ల, ఆగస్ట్ 31 ( పల్లె వెలుగు):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ )




పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులతో ఏబీవీపీ పోరుమామిళ్ల నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. నగర అధ్యక్షులుగా దేవేంద్రనాథ్ ని, నగర కార్యదర్శిగా కార్తీక్‌ను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాండురంగారెడ్డి , ముఖ్య వక్తలుగా బాల రంగయ్య గారు, బుసిరెడ్డి మనోహర్ రెడ్డి గారు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) ప్రధాన లక్ష్యమని తెలిపారు.విద్యార్థులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.పోరుమామిళ్ల ప్రాంతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై నిరంతరం ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల గొంతుకగా ఏబీవీపీ నిలవాలని నూతన నగర కమిటీకి సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన 30 మంది కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, పోరుమామిళ్లలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభిలాష్,చంద్ర,కార్తీక్,హర్ష,ముని,శివ,జైచంద్ర,రవీంద్ర, బ్రహ్మయ్య,మహేష్ మరియు ఏబీవీపీ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల గుండె చప్పుడుగా ‘ఇంటింటికీ తెలుగుదేశం’

- **కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ సాగిన పాదయాత్ర**
- **గడపగడపనా ఘన స్వాగతం పలికిన స్థానికుల**
- **హాజరైన రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని 37వ వార్డు ఎల్లమ్మ గుడి లైన్, బీడీ వర్కర్స్ కాలనీ ప్రాంతంలో ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ప్రత్యక్షంగా కలిశారు. ప్రభుత్వం మహిళలు, రైతులు, యువత, పేద మరియు మధ్యతరగతి వర్గాల కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను, వినతులను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు నాయకులకు ఘన స్వాగతం పలికి తమ సమస్యలను నిర్భయంగా పంచుకున్నారు. ప్రజల మద్దతుతో మరింత ఉత్సాహంగా.. కార్యక్రమంలో కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాల పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనతో ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం నిరంతరం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మరియు క్లస్టర్ కో–కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, సీనియర్ కార్యకర్త ఇమ్మనియేల్ (గిడ్డయ్య), యూనిట్ ఇన్‌ఛార్జ్ ఖాదర్ వలి, బూత్ ఇన్‌ఛార్జ్‌లు బాలకృష్ణ, సుబ్బరాయుడు, వెంకటేష్, రసూల్, అనిల్, మధు, రాజపోగు చిన్న చంద్రతో పాటు వార్డు ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు రావలసిన 10 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి.

డోన్ పల్లె వెలుగు ఆగస్టు 31–: డోన్ మండలం



చిన్నమల్కాపురం గ్రామపంచాయతీ కార్మికులకు రావలసిన 10 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి సిఐటియు డిమాండ్

గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతకు పాటుపడుతున్న కార్మికుల నిజ జీవితాలు మాత్రం అంధకారంలో డోన్ ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేత డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామ పంచాయతీ కార్మికులకు రావలసిన 10 నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,మండల నాయకులు పి.రామాంజనేయులు డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం స్థానిక కార్యాలయం నందు ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాల చెల్లింపునకు కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.10 నెలలుగా వేతనాలు రాకుంటే కార్మికులు కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సుమారు 28 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు,మరో 20,000 మంది గ్రీన్ అంబాసిడర్లు,700 మంది ఎన్ఎంఆర్ లు దశాబ్దాల తరబడి గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతకు పాటు పడుతున్నారన్నారు.గత ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వాలు వీరికి జీతాలు పెంచలేదని ఒకే విధమైన పని చేస్తున్నప్పటికీ రాష్ట్రం అంతటా ఒకే విధమైన జీతం చెల్లించడం లేదని ఒక్కో చోట ఒక్కో విధంగా నెలకు 6000 నుండి 12 వేల రూపాయల లోపు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారన్నారు.నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పాటు పెట్రోల్,డీజిల్,వంట గ్యాస్,కరెంటు చార్జీల బారాలు భరించలేక కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నాయని కావున ఒకే విధమైన పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా నెలకు 21 వేలు,స్వచ్ఛభారత్ కార్మికులకు 10వేల రూపాయల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.నెల నెల సక్రమంగా వేతనాలు రాకపోవడంతో కిరాణా షాపులలో సరుకులు కూడా ఇవ్వరని వడ్డీ వ్యాపారుల వేధింపులకు గురికావాల్సి వస్తుందని వారు అన్నారు.టెండర్లకు సంబంధించి 2015–2023లో హైకోర్టు ఇచ్చిన తీర్పులు అమలు కావడం లేదని 1999లో ఇచ్చిన 551 జీవోలో గుర్తింపు కార్డులు,కనీస వేతనము,పిఎఫ్,ఈఎస్ఐ అమలు చేయాలని ఉన్నా నేటికీ అమలు చేయడం లేదని వాటితో పాటు,132,142, 680 జీవోలను కూడా అమలు చేయడం లేదని ఇప్పటికైనా అమలు చేయాలని అమలు చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,టెండర్ల విషయంలో 2015 మరియు 2023లో హైకోర్టు ఇచ్చిన తీర్పులను కచ్చితంగా అమలు చేయాలని,చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని,సహజ మరణానికి 2 లక్షలు ప్రమాద బీమా 10 లక్షలు,దహన సంస్కారాలకు 20 వేలు ఇవ్వాలని సబ్బులు,నూనెలు,బట్టలు పనిముట్లు సకాలంలో ఇవ్వాలని పది నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న మల్కాపురం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు,ఎం.నాగరాజు, సి.మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# చదువుల గుడియా.. చెత్తకుప్పల గోడౌనా?!

- **నెత్తిపై పెచ్చులూడే పైకప్పు.. చుట్టూ దుర్గంధం వెదజల్లే చెత్తబుట్టలు!**
- **114 మంది పసిగుండెల్లో చావు భయం.. నేలపైనే పడి అక్షర రోదన**
- **విద్యాశాఖ మంత్రి లోకేష్ గారూ.. ఇదేనా ‘మనబడి--మన భవిష్యత్తు’?!**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరు పెట్టుకున్న ఆ బడిలో అడుగుపెడితే కడుపు తరుక్కుపోతోంది. అది విద్యార్థులను తీర్చిదిద్దే జ్ఞాన భాండాగారమా లేక పురపాలక శాఖ పారేసిన చెత్త డబ్బాల డంపింగ్ యార్డా అన్నది అర్థం కాక జనం ముక్కున వేలేసుకుంటున్నారు. కర్నూలు నగరం నడిబొడ్డున ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల దుస్థితిని చూస్తే పాలకుల మాటల గారడీకి, అధికారుల రాతి గుండెలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామన్న ప్రగల్భాలు ఇక్కడ చెత్తబుట్టల కింద సమాధి అయిపోతున్నాయి.

**పసి హృదయాల మధ్య ‘మున్సిపల్ చెత్త’!**

నగరంలో ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన మున్సిపాలిటీ చెత్తబుట్టలు దొంగలపాలు కాకుండా కాపాడటానికి పాఠశాల గది దొరికిందా? చెత్తబుట్టలను కాపాడేందుకు చిన్నారుల ప్రాణాలను, ఆరోగ్యాన్ని పణంగా పెడతారా? విషపు వాసనలు, కంపు కొట్టే చెత్తబుట్టల మధ్యే 114 మంది అమాయక చిన్నారులు గంటల తరబడి కూర్చుని పాఠాలు వినాల్సి వస్తోంది. చెత్తబుట్టల రక్షణపై ఉన్న శ్రద్ధ.. పసిపిల్లల భవిష్యత్తుపై విద్యాశాఖ అధికారులకు ఎందుకు లేకపోయింది?

**కూలడానికి సిద్ధంగా పైకప్పు.. వణికిపోతున్న చిన్నారులు!**










తరగతి గదుల్లో కూర్చోవాలంటేనే పసిపిల్లల వెన్నులో వణుకు పుడుతోంది. ఎప్పుడు ఏ పెచ్చు నెత్తిపై పడి ప్రాణం పోతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని చదువుకుంటున్నారు. కిటికీలు ఊడిపోయి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విద్యార్థులు పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. కూర్చోవడానికి కనీసం బెంచీలు కూడా ఇవ్వని దౌర్భాగ్య స్థితిలో, దుమ్ముధూళి నిండిన నేలపైనే గంటల తరబడి పసికూనలు మోకాళ్లపై చదువు సాగిస్తున్నారు.

**“సార్.. పెచ్చులు నెత్తిన పడతాయేమోనని భయంగా ఉంది. చెత్తబుట్టల వాసన భరించలేకపోతున్నాం. మంత్రి లోకేష్ సార్.. మా బడిని బాగుచేసి మమ్మల్ని కాపాడండి!”**

--- కన్నీటి పర్యంతమైన పసిపిల్లల ఆర్తనాదం

బాధ్యత మరిచిన యంత్రాంగం.. హెచ్ఎం చేతులెత్తేత!

స్టోర్ రూమ్‌లనే తరగతి గదులుగా మార్చేశామని, బల్లల కొరత తీవ్రంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు కళావతమ్మ చెబుతున్నారు. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖ అధికారి (వీజూ) దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. సమస్యలు తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారుల తీరుపై స్థానిక ప్రజలు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

లోకేష్ సార్.. కర్నూలు బడిపై కనికరం చూపండి! విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని, పేద విద్యార్థులకు అండగా ఉంటామని నినదిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే ఈ పాఠశాల దుస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలి. తక్షణమే ప్రకాశ్‌నగర్ పాఠశాలను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.